క్లుప్తంగా

అంగరంగ వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం



గ్రామంలో కొలువైన అభయాంజనేయస్వామి

రంగంపేట: గ్రామంలో వేంచేసి యున్న అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి తరువాత గ్రామంలో నిర్వహించే ఈ తీర్థ మహోత్సవానికి అత్యంత ప్రజాధరణ ఉంటుంది. మండలంలోని 17 గ్రామాల నుంచే కాక చుట్టు పక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు భారీ స్థాయిలో హాజరయ్యారు. ఉదయం తీర్థ బిందె తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా రాత్రి జరిగే తీర్థానికి విశేషంగా భక్తులు హాజరయ్యారు. బ్యాండు పార్టీల పోటీలు, మేళ తాళాలు, కోయ నృత్యాలు, కళ్లు మిరిమిట్లు గొలిపే విద్యుత్తు కాంతులు, బాణాసంచా పోటీలు ఆకట్టుకున్నాయి. బాణాసంచా పోటీల్లో విజేతకు బహుమతులు అందించారు.

వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం



సంపరలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెదపూడి, రంగంపేట: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. చంద్రేడులో కొలువైన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

అడుగడుగునా అడ్డంకులే..

- కాతేరు – సీతానగరం రోడ్డును తరచూ బ్లాక్ చేస్తున్న స్థానికులు
- ఫంక్షన్ల కోసం రోడ్డుపైనే టెంట్లు



కాతేరు - సీతానగరం రోడ్డుపై ఇనుగంటివారిపేట వద్ద ధాన్యం ఆరబోసిన దృశ్యం

సీతానగరం: రహదారి అభివృద్ధి చెందితే ప్రయాణానికి అనువుగా ఉంటుంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి గమ్యస్థానానికి చేరుకోవచ్చు. కుదుపుల బాధ లేకుండా వాహనాన్ని నడిపే వీలుంటుంది. సాధారణంగా అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇదే ఆలోచన ఉంటుంది. కానీ సీతానగరం మండలంలో వాహనచోదకులకు మాత్రం కొత్త కష్టం వచ్చింది. ఇటీవల అభివృద్ధి చేసిన కాతేరు - సీతానగరం ఆర్అండ్‌బీ రహదారిని స్థానికులు తరచూ బ్లాక్ చేస్తున్నారు. ఆ రోడ్డు పరిధిలోని గ్రామాలలో ఏ కార్యక్రమాలు జరిగినా రోడ్డుకు అడ్డంగా కర్రలు పెట్టి రాకపోకలను మళ్లిస్తున్నారు. వ్యతిరేక దిశలో వాహనాలు రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధం

కాతేరు - సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు పనులు పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ రోడ్డుపై ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. కానీ పలు గ్రామాల్లో ప్రజలు ఆ రోడ్డును తరచూ బ్లాక్ చేస్తున్నారు. మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టినప్పుడు రోడ్డుకు బ్లాక్ చేయడం సమంజసమే. కానీ సొంత ఫంక్షన్లు, వేడుకలు, వివిధ కార్యక్రమాలకు ప్రజలు బ్లాక్ చేయడం నిబంధనలకు విరుద్ధం. కానీ ఈ విషయాన్ని కొందరు పట్టించుకోవడం లేదు.

కాతేరు- సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు చాలాకాలం పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే దానికి మహర్దశ వచ్చింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ నాలుగు లైన్ల రోడ్ల అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు రాబట్టి పనులు చేపట్టారు. కాతేరు నుంచి సీతానగరం వరకు 18.2 కిలోమీటర్లు పొడవున నాలుగు లైన్లకు రోడ్డుకు అంచనా విలువ రూ.70 కోట్లు కాగా, మరో రూ.35 కోట్లు అవసరం అవుతుందని ఆర్అండ్‌బీ అధికారులకు ప్రతిపాదనలు పంపారు.

ప్రయాణం నరకమే..

కాతేరు నుంచి సీతానగరం వరకు గ్రామాల వద్ద సిమెంట్ డ్రైనేజీలు ఏర్పాటు చేసి, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశారు. ఈ విధంగా సుమారు 10.5 కిలోమీటర్లు నిర్మించారు. పలు గ్రామాల వద్ద నెల కొల్పిన కల్వర్టు వద్ద రోడ్డును కలపాల్సి ఉంది. ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణం చాలా సుఖవంతం అవుతుందని భావించారు. అయితే బ్లాక్‌ల కారణంగా ప్రయాణం నరకంగా మారింది.

ఏ కార్యక్రమం జరిగినా..

కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డును స్థానికులు పలు కారణాలతో బ్లాక్ చేస్తున్నారు. పెళ్లిళ్లు, అశుభ కార్యక్రమాలు, వివిధ వేడుకల కోసం రోడ్డుపై టెంట్లు, పందిళ్లు వేస్తున్నారు. ఇలా రోడ్డును బ్లాక్ చేయడం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రైతులు కూడా తమ పొలంలో పండిన ధాన్యాన్ని ఈ రోడ్డుపై ఆరబోస్తున్నారు. ఆ సమయంలో రోడ్డుకు అడ్డంగా రాళ్లు, కర్రలు పెడుతున్నారు. రాత్రి సమయంలో అవి కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డు బ్లాక్ చేయడంతో మహిళ మృతి

బొబ్బిల్లంక వద్ద రోడ్డును బ్లాక్ చేయడంతో ఈ ఏడాది మే నెలలో ఓ మహిళ మృతి చెందింది. ములకల్లంకకు చెందిన పోలిన భాగ్యలక్ష్మి తన భర్తతో బొబ్బిల్లంకలోని మెడికల్ షాపుకు వచ్చింది. మందులు కొనుక్కొని రోడ్డును దాటుతుంది. ఆ సమయంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. అక్కడ రోడ్డును బ్లాక్ చేయడంతో ఆటో రాంగ్ రూట్‌లో రావాల్సి వచ్చింది. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన సందర్భాల్లోను కొందరు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు



కాతేరు – సీతానగరం రోడ్డును పలు చోట్ల ఫంక్షన్ల కోసం బ్లాక్ చేస్తున్నారు. రోడ్డుపై టెంట్లు వేసి, కర్రలను అడ్డుగా పెడుతున్నారు. ఆ సమయంలో రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ముదునూరి రామకృష్ణంరాజు, చినకొండేపూడి

కారు నడపడానికి భయపడ్డాను



హైదరాబాద్ నుంచి కారులో బంధువుల ఇంటికి సీతానగరం వచ్చాను. కాతేరు – సీతానగరం రోడ్డును పలుచోట్ల ఫంక్షన్ల కోసం బ్లాక్ చేశారు. రాంగ్ రూట్‌లో కారులో రావడానికి భయపడ్డాను. స్టేట్ హైవే లో పరిధిలోని ఈ రోడ్డును బ్లాక్ చేయడం సరికాదు.

– ఎస్.మోహన్ కుమార్, హైదరాబాద్

నేడు దత్త జయంతి

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో దత్త జయంతిని పురస్కరించుకుని స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద దత్తాత్రేయునికి ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. కాగడ హారతితో పాటు పలు పూజా కార్యక్రమాలు, అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఈపీఎల్ విజేతగా బజాజ్ గ్లాడియేటర్స్

ప్రకాశం నగర్: ఈస్ట్ గోదావరి ప్రీమియం లీగ్ (ఈపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ విజేతగా బజాజ్ గ్లాడియేటర్స్ జట్టు నిలిచింది. స్థానిక ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలోని మైదానంలో శనివారం ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. దీనిలో బజాజ్ గ్లాడియేటర్స్ విజయబావుటా ఎగురవేసింది. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి, డాక్టర్ గోరంట్ల రఘుకిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సోము వీర్రాజు మాట్లాడుతూ 16 రోజులుగా 15 జట్లతో ఈ పోటీలు నిర్వహించిన నిర్వాహకులు జై కిషన్, బాలాజీలను అభినందించారు. అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపుఓటములు సహజమన్నారు. రఘు కిరణ్ మాట్లాడుతూ క్రీడాకారులను ఆదుకునేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ టోర్నమెంట్‌లో రంజీ ట్రోఫీ ఆటగాడు స్టీఫెన్‌ను మెమెంటోతో సత్కరించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మణికంఠ, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా సంతోష్, బెస్ట్ బౌలర్‌గా నసీరుద్దీన్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాయి ఎంపికయ్యారు.

ఎనర్జీ సిస్టమ్స్‌పై అవగాహన సదస్సు



నన్నయలో జరిగిన సదస్సుకు హాజరైన ప్రముఖులు

రాజానగరం: నేషనల్ సైంటిఫిక్ అడ్వైజరీ కమిటీ (ఎన్ఎస్ఏసీ) నిపుణులతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అధ్యాపకులకు ఇంటిగ్రేటెడ్ లోకల్ ఎనర్జీ సిస్టమ్స్ అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. సైన్స్ అండ్ టెక్నాలజీలోని ఫండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలను నిపుణులు తెలిపారు. కెమిస్ట్రీ, ఆక్వాకల్చర్, జియో సైన్సెస్ వంటి రంగాలలో అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, మాజీ డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.విజయ్ మోహన్ పిళ్ళై, డాక్టర్ సుకుమార్ దేవోట్టా, డాక్టర్ అశోక్ కుమార్ త్రిపాఠి, వాటర్ రీసోర్సెస్ నిపుణుడు ప్రొఫెసర్ పి.రాజేంద్ర ప్రసాద్, మిషన్ డైరెక్టర్ డాక్టర్ జేబీవీ రెడ్డి, డీఎస్‌టీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రద్యోత్ కోలే పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి అధ్యక్షుడిగా భాస్కరరామ్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడిగా ప్రముఖ ఆడిటర్ వి.భాస్కర రామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేఎన్ రోడ్డులోని ఏకేసీ కళాశాలలో గల రోటరీ ఫంక్షన్ హాల్లో శనివారం ఆంధ్ర కేసరి యువజన సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మార్గాని నాగేశ్వరరావు, కోసూరి చండీప్రియ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ఎస్‌జీఎస్ ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా తొంటెపు వీరభద్రస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కూర్మదాసు ప్రభాకర్, కార్యదర్శిగా దాసరి బ్రహ్మగిరీష్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు భాస్కరరామ్ మాట్లాడుతూ ఆంధ్రకేసరి యువజన సమితి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, తద్వారా ఆంధ్ర కేసరి విద్యాసంస్థల ప్రగతికి పాటు పడతానని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త విశ్వనాథ గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, చింతపెంట ప్రభాకరరావు, డీవీకే రమేష్, జమ్మి రామారావు, జెట్టి ప్రసాద్, బైర్రాజు ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- మంత్రి కందుల దుర్గేష్
- పుష్కరవనంలో కార్తిక వనసమారాధన

రాజానగరం: ప్రభుత్వం ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటకం, సాంస్కృతిక, సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. లాలాచెరువులోని గోదావరి మహా పుష్కర వనంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్తిక వన భోజన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు వెలుబుచ్చిన పలు సమస్యలపై మంత్రి స్పందించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఉద్యోగులందరూ కలసి నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు సమైక్యతను పెంపొందించేందుకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ రాజు, ఆస్కారరావు, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్, మహిళ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖలతోపాటు వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, గ్రామ/వార్డు సచివాయల, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు.

స్వార్థపరుల నుంచి సంఘాన్ని కాపాడుకుందాం

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన వ్యక్తులు స్వార్థచింతనతో రాజకీయాలు చేసి, అహంకారపూరితంగా వ్యవహరించారని, అటువంటి వారి నుంచి సంఘాన్ని కాపాడుకుందామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) మహాజన సభ (కౌన్సిల్)లో తీర్మానించింది. లాలాచెరువులోని గోదావరి మహా పుష్కర వనంలో శనివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఆధ్వర్యంలో పుష్కర వనంలో కార్తిక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మహాజన సభలో సంఘ కార్యక్రమాలపై కొద్దిసేపు సమీక్షించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ రాజు, ఆస్కారరావు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా జాడ లేకుండాపోయిన వ్యక్తితో ఉద్యోగ సమాజం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 11 తీర్మానాలను ప్రతిపాదించి, ఏకగ్రీవంగా ఆమోదించారు.



మంత్రి కందుల దుర్గేష్‌ని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

ఉద్యోగ వేదిక ఏర్పాటు

రాష్ట్రంలో భావసారూప్యత కలిగిన 20 సంఘాలతో ప్రాథమికంగా ఉద్యోగ వేదికను ఏర్పాటు చేశారు. దానికి తాత్కాలిక అధ్యక్షుడిగా ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శిగా ఉన్న జి.ఆస్కారరావు, స్త్రీ.శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డి.శ్రీకాంత్ రాజును జనరల్ సెక్రటరీగా, రాష్ట్ర ఆడిట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న బి.రవిశంకర్ కోశాధికారిగా నియమించారు. మిగిలిన సంఘాల అధ్యక్షులు కో చైర్మన్లు వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, గ్రామ/వార్డు సచివాయల, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రకాశం నగర్: స్థానిక రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలోని క్రీడా మైదానంలో శనివారం క్రిస్మస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేష్ బ్యాటింగ్ చేసి ఈ టోర్నీని ప్రారంభించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ సత్యనారాయణ టాస్ వేసి ఇరు జట్లకు అభినందనలు తెలిపారు.

బిక్కవోలు మండలంలోని అధికారుల వివరాలు

పేరు	హోదా	ఫోన్ నంబర్
వి. శ్రీనువాస్	ఎంపీడీవో	9848496088
ఎన్.జాన్ మిల్టన్	పంచాయతీ విస్తరణాధికారి	9110394865
–	తహసీల్దార్	9849903913
బీబీఎస్‌వీవీ కృష్ణ	డిప్యూటీ తహసీల్దార్	9866484845
యువై రత్నం	అసిస్టెంట్ ఇంజినీర్, పంచాయతీరాజ్	7036977405
ఎన్ సామ్యూల్ జాన్	వ్యవసాయ శాఖ ఏవో	8331056572
సీహెచ్‌వీవీ సత్యనారాయణ	మండల విద్యాశాఖ-1	9394222224
కె.పూర్ణచంద్రరావు	మండల విద్యాశాఖ -2	7981174295
కె.సాయి కుమార్	ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్	9111199576
రాంబాబు	ఏఈ, రోడ్డు భవనాల శాఖ	6301327292
ఏ.సరోజ	ఏఈఈ, నీటి పారుదల శాఖ, బిక్కవోలు	9885133949
కె.బుజ్జిదొర	ఏఈ, విద్యుత్ శాఖ	9440812650
వి.వనమయ్య	ఏఈ, హౌసింగ్	7093930486
వి.రవిచంద్ర కుమార్	ఎస్సై	9440904851
డాక్టర్ ప్రణీత్	వెటర్నరీ వైద్యులు, బిక్కవోలు	9494240289
డాక్టర్ దుర్గాదేవి	పీహెచ్‌సీ వైద్యులు, బిక్కవోలు	8008540157
డాక్టర్ విజయలక్ష్మి	పీహెచ్‌సీ వైద్యులు, కొంకుదురు	6303221241
అగస్టీన్	ఏపీవో ఉపాధిహామీ	7093998252
టి.సుప్రియ	ఏపీఎం వెలుగు	7993325064
శాంతి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బిక్కవోలు	9177060757
కృష్ణవేణి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఊలపల్లి సెక్టార్	6305213882
జెర్సీ ఫోరెన్స్	ఐసీడీఎస్ సీడీపీవో, రంగంపేట ప్రాజెక్టు	9491051561
ఎస్.ప్రభు కృష్ణ.	ఏఎస్ఓ	9493789131

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

రాజానగరం: సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. రాజానగరం మండలంలో ఆరుచోట్లా ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాజానగరంలోని చాగల్నాడు కాలువకు అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, కురుమెళ్ల వెంకటేశ్వర్లు, గాదరాడ - కలవచర్ల లిఫ్టునకు అడబాల వీర వెంకట సత్యనారాయణ, బొమ్ముల పరమేశ్వరి, కలవచర్ల కాలువకు కొయ్యలమూడి వెంకటేశ్వరరావు, మద్దూరి ముత్యాలరావు, జి.యర్రంపాలెంలోని తమ్మిరాజు చెరువుకు నర్రావుల ధనలక్ష్మి, అడబాల వీవీ సత్యనారాయణ, కొండగుంటూరులో పెమ్మనబోయిన సూరిబాబు, కామిరెడ్డి దుర్గ, నరేంద్రపురంలోని గోపిగుంట చెరువుకు సుంకర సూర్యనారాయణ, కర్రి శివఅరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. రాజానగరం తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఇరిగేషన్ ఏఈ సాయికృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలకు ఎంపీడీఓ ర్యూన్సీ, తహసీల్దార్ టి.రమణ, ఈఓపీఆర్డీ వై.లక్ష్మి, సీఎస్ డీటీ వై.సుజాత, డీటీ టి.శ్రీనివాస్, ఎలక్షన్ డీటీ కె.నిరంజన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో శనివారం 25 సంఘాలకు ఎన్నికలు జరిగాయి. మేజర్ ఇరిగేషన్ అయిన పుష్కర కాలువకు డబ్ల్యూఏ దోసకాయలపల్లి ఆయకట్టు ప్రాంతానికి అధ్యక్షుడిగా పోలేపల్లి రామారావు, ఉపాధ్యక్షుడిగా వై.రాంబాబు, టీసీఎంగా మార్ని నాగేంద్ర ప్రసాద్ ఎన్నికయ్యారు. అలాగే డబ్ల్యూఏ కోటికేశవరం ఆయకట్టు ప్రాంతానికి అధ్యక్షుడిగా అడపా వీరబాబును ఎన్నుకున్నారు. అనంతరం వీరందరూ బూరుగుపూడి జంక్షన్‌లోని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి కార్యాలయంలో ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు కంటే నాగకేశవరావు, మార్ని బుజ్జి పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని ఐదు సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, జలవనరులశాఖ ఏఈ శివరామకృష్ణ తెలిపారు. నాగంపల్లి సాగునీటి సంఘానికి ముంద్రు ఫణిరాజా వరప్రసాద్, వరద సత్యనారాయణ, పురుషోత్తపట్నానికి మందపాటి జగపతిబాబు, వేములపల్లి శ్రీనివాసరావు, చినకొండేపూడికి శ్రీనివాస్, ఉండవల్లి వీరవెంకట్రావు, రఘుదేవపురానికి వేగి శ్రీనివాసరావు, వాకాటి నాగమణి, మునికూడలికి నిడదవోలు మంగతాయారు, కాంద్రగడ్డ రామారావు చౌదరి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.



రాజానగరం చాగల్నాడు కాలువకు అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ర్యూన్సీ

బిక్కవోలు: మండలంలోని గ్రామస్థాయి నీటి సంఘం కమిటీ ఏర్పాటు పూర్తయినట్లు తహసీల్దార్ బీవీవీఎస్ కృష్ణ తెలిపారు. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో బిక్కవోలు అధ్యక్షుడిగా నందిపాటి బుల్లి అబ్బులు, ఉపాధ్యక్షుడిగా పడాల లక్ష్మణరావు, బలబద్రపురం అధ్యక్షుడిగా నల్లమిల్లి దత్తుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేడపాటి సూర్యనారాయణరెడ్డి, కొమరిపాలెం అధ్యక్షుడిగా కర్రి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కర్రి హరిశ్చంద్రారెడ్డి, పందలపాక అధ్యక్షుడిగా వల్లూరి వీర భాస్కర ఫణికుమార్, ఉపాధ్యక్షుడిగా కాకర్ల రామతారకం, కొంకుదురు అధ్యక్షుడిగా కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొవ్వూరి నాగేశ్వరరెడ్డి, ఎంపియ్యారు. వీరికి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు తెలిపారు.



బూరుగుపూడిలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి సత్కారం

పెదపూడి: అనపర్తి మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆయన అనపర్తిలో మాట్లాడుతూ మండలంలో ఐదు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయని అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవమయ్యారని వెల్లడించారు. అనపర్తి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా తమలంపూడి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడిగా జి.గంగాధరరావు, పొలమూరు నీటి సంఘం అధ్యక్షుడిగా చిర్ల ఆదిరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పోతంశెట్టి ధనసూర్యలక్ష్మి, రామవరం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కర్రి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి, పులగుర్త సాగునీటి సంఘం అధ్యక్షుడిగా జి.వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా గారపాటి సురేంద్ర, కుతుకులూ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పడాల వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లిడి సత్తిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా సంఘాల ఎన్నికల అధికారులు ఎన్నికైన వారికి నియామక ధ్రువపత్రాలు అందించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నూతన సంఘ సభ్యులను అభినందించారు.



రఘుదేవపురం సాగునీటి సంఘానికి ఎంపికైన కమిటీ సభ్యులు

పెదపూడి: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని తహసీల్దార్ పీవీ. సీతాపతిరావు తెలిపారు. మండలంలో ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయని వాటిలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిబంధనల ప్రకారం నిర్వహించారన్నారు. పెదపూడి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఐదోసారి కోరా రామన్న చౌదరి, ఉపాధ్యక్షుడిగా పబ్బినీడి సాయి రామకృష్ణ, కరకుదురు నీటి సంఘం అధ్యక్షుడిగా తోటకూర వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి బ్రహ్మానందరావు, గంఢ్రేడు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా సానా శ్రీనివాస ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా గంటా అమ్మిరాజు, ఏపీత్రయం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా అడబాల వీర్రాజు, ఉపాధ్యక్షుడిగా చల్లా వెంకటేష్, పెద్దాడ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఆరుమిల్లి వెంకటరాజు, ఉపాధ్యక్షుడిగా సబ్బినీడి బుల్లిదొర, జి.మామిడాడ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నల్లమిల్లి సుబ్బిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేడపాటి నారాయణరెడ్డి, సంపర సాగునీటి సంఘం అధ్యక్షుడిగా తిబిరిశెట్టి సత్తిరాజు, ఉపాధ్యక్షుడిగా నర్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా సంఘాల ఎన్నికల అధికారులు ఎన్నికైన వారికి నియామక ధ్రువపత్రాలు అందించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పుట్టా గంగాధర్ చౌదరి, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు జుత్తక కృష్ణ, నాగిరెడ్డి వీరాస్వామి, ఎన్డీఏ నాయకులు రావాడ నాగు, సింగినీడి దత్తుడు, ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, తమలంపూడి శివరామారెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.



పెదపూడి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కోరా రామన్న చౌదరి, సభ్యులు

